# దీపావళి

శ్రీ పగడాల హరిప్రసాదరావు
(జాతీయ రచనామండలి)

అదిగో! ఆ కనబడే మేడ యెవరిదో జ్ఞాపకముందా? ఏం? ఆనమాలు పట్టలేక పోతున్నావా! అవునులే యెలా సాధ్యమవుతుంది! పూర్వమున్న కళ యేదీ దానికి?

అది డాక్టరు రమణరావు ఆరోగ్యభవనం. పూర్వం ఆ మేడముందు యెంత సందడిగా వుండేది! ఇప్పుడు పాపం నిర్మానుష్యంగా వుంది ఆ వీధంతా.

రమణరావు విదేశాలకు వెళ్ళి డాక్టరు ప్యాసయి వచ్చేడు. అతను ఓడ దిగీదిగడంతోనే మద్రాసు జనరల్ హాస్పిటల్‌కు సర్జన్ జనరల్‌గా నియమించింది ప్రభుత్వం. తొలుత యెంతో ఆనందంగా స్వీకరించాడా వుద్యోగాన్ని. కాని, రానురాను అతని మనస్సు—దేశంయొక్క దౌర్భాగ్యస్థితిని చూస్తూంటే అతనికి ఉద్యోగంమీద విరక్తి కలుగజొచ్చింది. బాపూజీ శంఖారావాన్ని విని దేశసేవకు దాసుడై తన పదవికి రాజీనామా యిచ్చేడు.

స్వతంత్రుడవగానే గొప్ప రాజకీయవేత్తయినాడు. శాశనోల్లంఘనదినాల్లో యెక్కడ చూచినా రమణరావే! అతని వుపన్యాసాన్ని వినడానికి జనం తండోపతండాలుగా వచ్చేవారు. అందుకు ప్రతిఫలంగా ప్రభుత్వం అతనికి ఆరు నెలలు శిక్ష విధించింది.

తన శిక్షాకాలాన్ని ముగించుకుని రమణరావు తిరిగి వచ్చేటప్పటికి భార్య ప్రసూతి వ్యాధితో బాధపడుతూంది. తనకున్న శక్తినంతా—తన విద్యనంతా వుపయోగించి ప్రయత్నించాడు. కాని......

అతనికి మిగిలింది—భార్య తనకు బదులుగా విడిచివెళ్ళిన—ఆడశిశువు!

అప్పటినుండి రమణరావు మద్రాసువదలి యీ పల్లెలో స్థిరనివాస మేర్పరచుకున్నాడు. అతడు దీనజనులకు కల్పతరువు. రోగులతో అతని ఆరోగ్యమందిర మెప్పుడూ కిటకిటలాడుతుండేది.

రమణరావు యీ పల్లెకువచ్చి దీనికి మహోపకారం చేశాడు. ప్రతిరోజూ మూలమూలలకు వెళ్ళి గ్రామ పారిశుద్యంగురించీ, కుటీర పరిశ్రమల గురించీ బోధిస్తూండేవాడు. కొంతడబ్బు వినియోగించి బీదవారికి రాట్నాలను కొనియిచ్చి వారి జీవనోపాధికి తోడుపడ్డాడు. అంతేకాకుండా వయోజన పాటశాల ఒకటి స్థాపించాడు. ఈ పనులవలన పల్లెప్రజలు కండ్లు తెరచారు. దేశమంటే ఏమిటో-బానిసతనంవలన ఎంత బాధపడుతున్నారో గుర్తించుకోగలిగారు. దానితో పల్లెలో గొప్ప మార్పు వచ్చింది. మహాత్ముని నిర్మాణ కార్యక్రమ సూత్రాలను అన్నింటినీ రమణరావు యీ పల్లీయులచే అవలంబింపజేశాడు.

రమణరావు విధురుడయి నాలుగేండ్లు దాటి పోయాయి. ఆ నాలుగేండ్లలో తనకున్న తీరిక కాలాన్ని తన ముద్దుబిడ్డ శశిని సంతోషపెట్టడానికి వినియోగించేవాడు. ఒక్కక్షణం శశిని విడిచివుండలేక పోయేవాడు. ఎక్కడన్నా రమణరావు కనబడ్డాడంటే అతని ప్రక్కనే శిశువుందన్న మాటే!

ఆరోజు దీపావళి. ఎక్కడచూచినా ఆనందలక్ష్మి నాట్యమాడుతూంది. నిత్యదరిద్రుల పూరికొంపలుకూడా కళావిలసితమై వున్నవంటే, యింక రమణరావు భవనం యెలా వుంటుంది? తన కూతురు సంతోషానికై అతడు తన భవనాన్నంతా రంగురంగుల క్రొవ్వొత్తి దీపాలతో అలంకరింపజేశాడు.

రాజకీయాలలో ప్రవేశించినప్పటినుండి రమణరావు మందుగుండు కాల్చడమంటే చాల బాధపడేవాడు. తనదేశపు బీదప్రజల పైకం యెంతో మందుగుండను పేరుతో విదేశాలకు యెగిరిపోతూండడం సహించలేక—దానినిగురించి తీవ్రంగా వుపన్యసిస్తూండేవాడు. కాని, యిప్పుడతనికి కావలసింది శశియొక్క చిరునవ్వు. తల్లిని అడుగుతుందేమోనని శశిని యెప్పుడూ ఆనందంగా వుంచడానికే అతడు ప్రయత్నించేవాడు.

అందువలన తన ముద్దుబిడ్డ ముత్యాల చిరునవ్వుకై చాల డబ్బు ఖర్చుపెట్టి యెన్నోరకాల మందుగుండు సామాను చేయించాడు.

యుద్ధమువలన పూర్వమంత విరివిగా లేకపోయినా—ధనవంతుల యిండ్లనుండి టపాకాయల ధ్వనులు బయలువెడలసాగాయి.

రమణరావు యింటిముందుకూడా అతని నౌకర్లు చిచ్చుబుడ్లు, మతాబులు, సిసింద్రీలూ కాల్చసాగారు. రమణరావు శశి కుర్చీలలో కూర్చుని ఆ వేడుక చూస్తూన్నారు. మతాబుల వెలుగుకి శశి తన మృదుకరపల్లవాలని చూపుతూ ఆనందంతో కేకలువేస్తూంది. తన శశి సంతోషాన్ని చూచి రమణరావు సంతుష్టుడవుతున్నాడు.

అంతలోనే కాల్చుతూన్న సింసింద్రి యెగిరి వచ్చి శశి ఒడిలో పడడం—ఆమె ధరించిన పాండూరు ఖద్దరు ఫ్రాకు తగలబడడం—క్షణంలో జరిగిపోయింది.

శశి శరీరమంతా కాలిపోయింది. రాత్రి పన్నెండు గంటలకు—బాధ భరించలేక—తన మాతృదేవి ఛాయాచిత్రాన్ని చూస్తూ శశి......పోయింది...ఆ మందిరపు ఆనందలక్ష్మి ఆనాటితో అంతరించిపోయింది.

తన శరీరంలోని సగభాగమై సంచరించిన అర్ధాంగిని కోల్పోయి—ఆమె జ్ఞాపకచిహ్నమైన శశికూడ తన మాతృదేవిని చేరబోయేప్పటికి—రమణరావు పిచ్చివాడైపోయాడు.

ఎప్పుడూ శశియొక్క ముద్దుపల్కులను తలంచుకుంటూ—యెక్కడో ఒకమూల కూర్చుంటాడు. ఎవరు పలకరించినా పలకడు. ఎప్పుడో తన కిష్టమైతే ఆహారం తీసుకోవడం—ఎల్లప్పుడూ తన శశి ఫోటో చూస్తూ కాలం గడుపుతూంటాడు.

అతని జీవితంలో—దీపావళి—మరువరాని రోజయింది.

